మహాత్మాగాంధీకి నివాళి



మూసాపేట్ వార్డు కార్యాలయ సమీపంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మూసాపేట: మూసాపేట వార్డు కార్యాలయం సమీపంలో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి మూసాపేట కాంగ్రెస్ నాయకులు చున్నూ పాష పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్, సతీష్‌గౌడ్, మల్లేష్‌యాదవ్, కేబుల్ శ్రీను, నర్సింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మబండలో..

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండలోని మహాత్మా గాంధీ విగ్రహానికి ఆల్విన్‌కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రూబెన్, నారాయణ, వసంత, సుజాత, రాజా, శ్రీను, బాలు, రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఎల్లమ్మబండలో నివాళులు అర్పిస్తున్న శ్రీనివాసరావు



కేపీహెచ్‌బీలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బండి రమేష్, సత్యం శ్రీరంగం

విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు



ప్రభుత్వ కళాశాలలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సనత్‌నగర్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 400 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్.అలివేలు మంగమ్మ మాట్లాడుతూ... మారిన జీవనశైలి, పెరిగిన సెల్‌ఫోన్ వినియోగం వల్ల కంటి సమస్యలు అధికం అవుతున్నాయని అన్నారు. నిర్ణీత వ్యవధిలో కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కంటి లోపం ఉన్న ప్రతి విద్యార్థికి ఉచితంగా కళ్లద్దాలు ఇవ్వనున్నట్లు లయన్ జీవీ రమణారెడ్డి తెలిపారు. కళాశాలలో విద్యతో పాటు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించటంలో ఎన్‌ఎస్‌ఎస్ తన పాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డా. వాణి, రవికుమార్, డా.సాలయ్య, వైస్‌ప్రిన్సిపాల్ డా.భవాని, అధ్యాపక బృందం, రమేష్‌బాబు, డా.మలిక్, కరుణ తదితరులు పాల్గొన్నారు.

నాడు వ్యర్థాలకు నిలయం.. నేడు పచ్చందాలకు నెలవు

- 'ఐఎస్‌బీ'కి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు
- ఆహ్లాదకర వాతావరణం, ఆధునిక వసతులు



ప్రస్తుతం పచ్చదనంతో కళకళలాడుతున్న ఐఎస్‌బీ

రాయదుర్గం: కచ్చారోడ్డు.. పిచ్చిమొక్కలు.. మట్టికుప్పలు, వ్యర్థాలు పారబోసే ప్రాంతంగా ఉండే ప్రాంతం నేడు 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్' (ఐఎస్‌బీ) అనేది అంతర్జాతీయంగా గుర్తింపుతో పాటు దేశంలోనే నెంబర్ వన్ బిజినెస్ స్కూల్‌గా అందరి ప్రశంసలు అందుకుంటోంది. ఈ ఉన్నత విద్యాసంస్థ ఏర్పడి 23 ఏళ్లు పూర్తికావడం విశేషం. గచ్చిబౌలి ప్రాంతంలో ఒకప్పుడు వ్యర్థాలతో కూడిన ఎగుడుదిగుడు చదను చేయలేకుండా ఉన్న ప్రాంతంగా ఉండే చోటును చదును చేసి ప్రస్తుతం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన విద్యాలయంగా తీర్చిదిద్దబడింది. 23 ఏళ్ల క్రితం గచ్చిబౌలి ఐటీ కారిడార్‌కు ఆనుకొని ఏర్పాటు చేసిన ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) నేడు ఎంతో ప్రగతిని సాధిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకతను సాధించింది. గచ్చిబౌలి లో ప్రధాన క్యాంపస్‌ను ఉండగా పంజాబ్ రాష్ట్రంలోని మొహాలీలో మరో క్యాంపస్‌ను ఏర్పాటు చేశారు. దేశంలో ఉన్నతమైన ఉన్నతవిద్యా కేంద్రంగానే కాకుండా ఆహ్లాదపూరిత వాతావరణం, పచ్చదనం, వివిధ రకాల పక్షులు నెమళ్లకు నిలయంగా మారింది.

కలుషిత నీటి సమస్యకు పరిష్కారం



భరత్‌నగర్ కాలనీలోని ఈడబ్ల్యూఎస్ ప్రాంతంలో మరమ్మతులు చేస్తున్న వాటర్‌వర్క్స్ సిబ్బంది

మూసాపేట: భరత్‌నగర్‌కాలనీ ఈడబ్ల్యూఎస్‌లో గేట్ వాల్వ్‌కు మంగళవారం వాటర్ వర్క్స్ అధికారులు మరమ్మతులు చేశారు. 'కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలి' అనే శీర్షికన మంగవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురించటంతో అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టారు. గేట్ వాల్వ్ చుట్టూ తవ్వి కలుషిత నీరు చేరకుండా మరమ్మతులు చేస్తున్నారు. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఫిబ్రవరి 2 నుంచే 'ప్రత్యేక' పాలన

రేపటితో ముగియనున్న గ్రామ పంచాయతీ పాలకవర్గం పదవీకాలం

- నగర శివారుల్లోని మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 619 పంచాయతీలు
- స్పెషల్ ఆఫీసర్ల నియామకానికి ప్రతిపాదనలు
- ఆమోదించిన ప్రభుత్వం



సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రామ పంచాయతీ పాలకవర్గ పదవీ కాలం రేపటితో ముగియనుండడంతో వచ్చే నెల 2 నుంచి ప్రత్యేకాధికారుల పాలన అమల్లోకి రానున్నది. ప్రభుత్వ ఆదేశాల మేరకు నగర శివారులోని మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 619 గ్రామ పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల నియామకంపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఈ మేరకు ఎంపీడీఓలు, ఎంపీఓలు, తహసీల్దార్లతో సహా వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా, డివిజన్ అధికారుల నియామకానికి ప్రతిపాదనలను సిద్ధం చేసిన అధికార యంత్రాంగం సంబంధిత జాబితాను ప్రభుత్వానికి ప్రతిపాదించింది. వాటికి ఆమోద ముద్ర పడడంతో నిర్దేశించిన గ్రామ పంచాయతీలకు వీరు ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు స్వీకరించి ఫిబ్రవరి 2 నుంచి విధులు నిర్వర్తించనున్నారు.

నగర శివారుల్లో 619 పంచాయతీలు

నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 619 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 61 జీపీలు, రంగారెడ్డి జిల్లాలో 558 పంచాయతీలు ఉన్నాయి. సర్పంచ్‌తో సహా పాలక వర్గం పదవీ కాలం రేపటి (ఫిబ్రవరి1)తో ముగియనుండడంతో వారి స్థానంలో స్పెషల్ ఆఫీసర్లుగా నియమితులైన అధికారులు గ్రామాల్లో ప్రజల బాగోగులను పర్యవేక్షించడంతో పాటు వారికి అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులు, హరితహారం, వీధిలైట్లు, పల్లె ప్రకృతి వనాలు, డంప్ యార్డులు, వైకుంఠధామాల నిర్వహనతో పాటు వివిధ రకాల పన్నుల వసూళ్లు, నూతన భవనాలు, ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు తదితర వాటిపై పర్యవేక్షణ చేయనున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మూసాపేట: కేపీహెచ్‌బీ 4వ ఫేజు 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ తెలిపారు. బుధవారం కేపీహెచ్‌బీ 15వ ఫేజు, కైత్లాపూర్, కేపీహెచ్‌బీ 4వ ఫేజు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు.. రామ్‌దేవ్‌రావు ఆసుపత్రి, బాలాజీనగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

భాగ్యనగర్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. సమతానగర్, గురుకుల్ స్కూల్ వెనుక వైపు ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు..

- వెస్ట్రన్‌హిల్స్ ఫీడర్ పరిధిలో ఐసీఐసీఐ బ్యాంక్ వెనుక వైపు, అడ్డగుట్ట, బచ్‌పన్ స్కూలు లైన్ మధ్యాహ్నం 12.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు..
- వినాయక ఫీడర్ పరిధిలోని శాతవాహన పార్కు లైన్, శివాలయం దేవాలయం లైన్, శాతవాహననగర్‌లలో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సభ్యుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల

మూసాపేట: భరత్‌నగర్‌కాలనీలోని హరిహర క్షేత్రం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు నూతన సభ్యుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేశామని ఈఓ కె.అంజయ్య తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఫిబ్రవరి 18వ తేదీలోపు దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్‌కు, అసిస్టెంట్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఘనంగా ప్రగతి మహిళా కళాశాల వార్షికోత్సవం



వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న క్రైమ్ డీసీపీ శిల్పవల్లి, సెక్రటరీ రవీందర్‌రావు

కూకట్‌పల్లి: వివేకానందనగర్‌లోని ప్రగతి మహిళా జూనియర్, డిగ్రీ కళాశాలల వార్షికోత్సవం జేపీనగర్‌లోని విశ్వనాథ్ గార్డెన్స్‌లో మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సైబరాబాద్ క్రైమ్ విభాగం డీసీపీ శిల్పవల్లి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థినులు సైబర్ క్రైమ్ పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. టెక్నాలజీని అవసరమైన మేరకు వినియోగించుకుంటే నేరాలను నియంత్రణలో ఉంచుకోవచ్చని సూచించారు. దేశంలోని మహిళలు ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లోనూ ముందంజ వేయాలన్నారు. దానికి చదువు ఒక ఆయుధమన్నారు. కళాశాల సెక్రటరీ రవీందర్‌రావు మాట్లాడుతూ... మహిళా సాధికారత పూర్తి స్థాయిలో సాధించినప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ప్రకృతిని కాపాడాలి అనే నాటిక, పరమానందయ్య శిష్యుల హాస్య నాటిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

రామకృష్ణనగర్‌లోని సమస్యలను పరిష్కరిస్తాం



రామకృష్ణవీధిలో బండరాళ్ల సమస్యను పరిశీలిస్తున్న ఏకాంత్‌గౌడ్, విద్యాకల్పన

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు ఏకాంత్‌గౌడ్, విద్యాకల్పన మంగళవారం వివేకానందనగర్ డివిజన్ రామకృష్ణనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. రోడ్ నం.17లోని బండరాళ్లను తొలగించి రోడ్డును అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ సందర్భంగా స్థానికులు రిక్షాపుల్లర్స్ కాలనీ నుంచి డ్రైనేజీ రోడ్ నం.19లో 8 ఇంచల డ్రైనేజీ పైపు ఓవర్‌ఫ్లో కావడంతో డ్రైనేజీ రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తోందన్నారు. పైపుల సామర్థ్యాన్ని పెంచాలని స్థానికులు వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, నవీన్, పల్నాటి అశోక్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'సీఏఎస్‌ఈఎస్‌టీ'కి టెక్నోవేషన్ అవార్డు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎలక్ట్రానిక్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ (సీఏఎస్‌ఈఎస్‌టీ)కు జాతీయ స్థాయి అవార్డు లభించడం విశేషం. ఇండియా ఎలక్ట్రానిక్స్ సెమీ కండక్టర్ అసోసియేషన్ (ఐఈఎస్‌ఏ) ద్వారా 2024 టెక్నోవేషన్ అవార్డును అందుకొంది. ఐఈఎస్‌ఏ ఎలక్ట్రానిక్స్ సెమీ కండక్టర్ డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ కోసం భారతదేశం యొక్క ప్రధాన పరిశ్రమ సంస్థగా కొనసాగుతోంది. హెచ్‌సీయూలోని స్కూల్ ఫిజిక్స్‌లోని సీఏఎస్‌ఈఎస్‌టీ సెంటర్‌కు ఇటీవల జరిగిన విజన్ సమ్మిట్-2024లో ఈ అవార్డును అందించారు. ఎంటెక్ (ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ టెక్నాలజీ, ఎంటెక్ (మైక్రో ఎలక్ట్రానిక్స్, వీఎల్‌ఎస్‌ఐ కోర్సులలో 150 మందికి పైగా విద్యార్థులకు శిక్షణ అందించినందుకు గుర్తింపుగా ఈ అవార్డుకు ఎంపిక చేయడం మరో విశేషం. ముఖ్యంగా ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ డిజైన్ అండ్ సెమీ కండక్టర్ తయారీ ప్రక్రియలో శిక్షణ, ఫ్యాబ్రికేషన్ సదుపాయంలో అందించబడుతుంది. ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ 2023లో సీఏఎస్‌ఈఎస్‌టీకి చిప్‌టుస్టార్టప్ ప్రాజెక్టును అందజేసింది. బోధన, పరిశోధన కార్యక్రమాలను బలోపేతం చేయడానికి, జాతీయ సెమీకండక్టర్ మిషన్‌కు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను పెద్ద సంఖ్యలో ఉత్పత్తి చేయడానికి అవకాశం కలుగుతుంది. హెచ్‌సీయూలోని సీఏఎస్‌ఈఎస్‌టీ సెంటర్ 2024 టెక్నోవేషన్ అవార్డును పొందడం సంతోషంగా ఉందని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు అవార్డులు సాధించాలని హెచ్‌సీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. దశాబ్దాలుగా సీఏఎస్‌ఈఎస్‌టీలో అందించబడుతున్న ఉన్నత స్థాయి నాణ్యమైన శిక్షణ, విద్య యొక్క దీర్ఘకాల నిబద్ధతకు ప్రతీకగా నిలుస్తోందన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్‌లోని సెవన్‌హిల్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యులుగా లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ, వంశీకృష్ణ, సుశీల, రవీంద్రనాథ్‌రెడ్డి, దొడ్ల బ్రహ్మానందగౌడ్, సదా శ్రీనివాస్ నియమితులయ్యారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్ మంగళవారం వారికి నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యంగౌడ్, కావూరి ప్రసాద్, వెంకటేష్, నాగయ్య, డి. వాసు, రాము, కోటేశ్వరరావు, శ్రీనివాస్‌రావు, రాజేందర్‌ప్రసాద్, వెంకట్‌రావు, కొఠారి వెంకట్, ఎస్‌వీ రావు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలోని నారాయణ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ప్రధానోపాధ్యాయురాలు సరిత ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా జోన్ ఏజీఎం వైజయంతి, ఆర్‌అండ్‌డీ డిపార్టుమెంట్ శ్రీలక్ష్మి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలతో సంబరాలు మిన్నంటాయి.

నాలాల్లోని వ్యర్థాలను తొలగించాలి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దర్‌నగర్‌లో మంగళవారం కార్పొరేటర్ సబిహా బేగం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సఫ్దర్‌నగర్‌లోని సున్నం చెరువు, కాముని చెరువు మీదుగా ప్రవహిస్తున్న నాలాలో వ్యర్థాలు పేరుకపోయాయి. వెంటనే వ్యర్థాలను తొలగించి మురుగు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ హమీద్, అహ్మద్, బాబా, పార్వతమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో కులగణనను వ్యతిరేకించడం అవివేకం

ఉస్మానియాయూనివర్సిటీ: ఆంధ్రప్రదేశ్‌లో కులగణనను నిలిపివేయాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ ఈసీకి లేఖ రాయడం అవివేకమని బీసీ సంక్షేమ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. మతిభ్రమించి మాట్లాడుతున్న ఆయన్ను విశాఖలోని మానసిక వైద్యశాలలో చేర్పించాలన్నారు. సీఎం వైఎస్ జగన్ పేదల అభ్యున్నతి కోసం కృషి చేస్తుంటే కావాలని కొందరు కుట్రలు పన్నుతున్నారని కులగణనతోనే బీసీల హక్కులు సాధించుకోగలమన్నారు.

ఓయూలో విద్యార్థుల అరెస్ట్

ఉస్మానియాయూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీతో పాటు ఇతర కోర్సులకు పెంచిన ఫీజులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టిన విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు వీసీ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. విద్యార్థి వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న వీసీ ప్రొ.రవీందర్ పదవి నుంచి తప్పుకోవాలని, సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతులలో జరిగిన అక్రమాల విచారణ చేపట్టాలని, లేడీస్ హాస్టల్ విద్యార్థినులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

డీజీపీకి ఓయూ జేఏసీ నేత ఫిర్యాదు

ఉస్మానియాయూనివర్సిటీ: తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ పై ఓయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ సురేష్ యాదవ్ మంగళవారం రాష్ట్ర డీజీపీ రవిగుప్తాకు ఫిర్యాదు చేశారు. మామిడి హరికృష్ణ తనను హత్య చేయాలని కొందరికి సుపారి ఇచ్చినట్లు ఆరోపించారు. గత కొంత కాలంగా తనను చంపుతానని సుపారి గ్యాంగ్ ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని సెల్ నంబర్లను డీజీపీకి అందించారు. మామిడి హరికృష్ణతో తనకు ప్రాణహాని ఉందని వెంటనే ఆయనను అరెస్ట్ చేసి విచారించాలని ఫిర్యాదులో పేర్కొనట్లు సురేష్‌యాదవ్ తెలిపారు.

గడువు పెంపు

- రేషన్‌కార్డు లబ్ధిదారులకు మరో అవకాశం
- ఫిబ్రవరి 28 వరకు ఈ-కేవైసీ కార్యక్రమం
- ఖైరతాబాద్ పరిధిలో 75.99 శాతం పూర్తి

రేషన్‌కార్డు లబ్ధిదారుల పారదర్శకత కోసం ఇటీవల ప్రభుత్వం ఈ-కేవైసీ ప్రవేశపెట్టింది. ఈక్రమంలో మృతి చెందిన వారి పేర్లు తొలగించి.. తాజాగా ఉన్న లబ్ధిదారుల సంఖ్య తెలుసుకునేందుకు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఇప్పటికే అనేకసార్లు గడువు పెంచుతూ ఈ-కేవైసీ తప్పనిసరిగా చేసుకునే వెసులుబాటు కల్పించారు. అయినా, కొంతమంది ముందుకు రాకపోవడంతో మరోసారి గడువు పెంచుతూ నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం.



బంజారాహిల్స్: ఖైరతాబాద్ రేషనింగ్ సర్కిల్-7 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలోని 81 రేషన్ దుకాణాలలో ఇప్పటి వరకు 75.99 శాతం ఈ-కేవైసీ పూర్తయ్యింది. ఈ-కేవైసీ చేయించుకోవాలని ఆయా డీలర్లతో పాటు సంబంధిత రేషన్ ఇన్‌స్పెక్టర్లు కూడా కార్డుదారులకు సూచిస్తున్నారు. సర్కిల్-7 పరిధిలో పలుచోట్ల రేషన్‌కార్డుల్లో చనిపోయిన వారి పేర్లతో పాటు వివాహం చేసుకున్న యువతుల పేర్లు కార్డుల్లో ఉన్నాయి. వారి పేర్లు తొలగించాల్సి ఉండగా అలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో కార్డుల్లో ఉన్నవారి పేర్లపైనా లబ్ధిదారులు ప్రతినెలా బియ్యం తీసుకుంటున్నారు. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వం ఈ-కేవైసీ అమలుచేస్తోంది. రేషన్‌కార్డులో పేర్లున్న లబ్ధిదారులంతా తప్పకుండా రేషన్ దుకాణానికి వెళ్లాల్సి ఉంటుంది. ఈ-పోస్ యంత్రంలో వేలిముద్ర వేయగానే ఆధార్ నెంబర్ చూపిస్తుంది. ఆకుపచ్చ వెలుతురు వస్తే ఈ-కేవైసీ పూర్తయినట్టు. ఫిబ్రవరి 28 వరకు అవకాశం ఉందని.. కార్డుదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే, ఈ-కేవైసీ చేసుకోకుంటే రేషన్ కోటలో కోత విధించే ప్రమాదం ఉందని కూడా హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

ఫిబ్రవరి 28 వరకు గడువు..

రేషన్ దుకాణంలో ఈ-కేవైసీ చేయించుకునేందుకు ఫిబ్రవరి 28 వరకు ప్రభుత్వం గడువు పొడిగించింది. గత ఏడాది సెప్టెంబర్‌లో ఈ ప్రక్రియను ప్రారంభించి.. పలుమార్లు గడువు పొడిగిస్తూ వచ్చారు. జనవరి 31 వరకు తుది గడువు నిర్ణయించినా.. చాలా మంది ఇంకా ముందుకు రాకపోవడం గమనార్హం. ఖైరతాబాద్ సర్కిల్-7లో 24 శాతం మంది రేషన్ దుకాణాల్లో వెళ్లి వేలిముద్రలు వేయలేదు. రేషన్ డీలర్లు, సంబంధిత అధికారులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నా.. ఇంకా కొంతమంది వేలిముద్రలు వేయాల్సి ఉంది. దీంతో ఫిబ్రవరి 28 వరకు గడువు పొడిగించారు. ఈ గడువులోనైనా మిగతా వారంతా ఈ-కేవైసీ చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

తెల్ల రేషన్‌కార్డులు 83,051..

ఖైరతాబాద్ రేషనింగ్ సర్కిల్-7 పరిధిలోని ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధుల్లో 81 రేషన్‌షాపులు ఉండగా.. ఇందులో తెల్ల రేషన్‌కార్డులు 83,051 ఉన్నాయి. అదేవిధంగా అంత్యోదయ అన్నయోజన(ఏఏవై) 3,533.. అన్నపూర్ణ కార్డులు 1 ఉన్నాయి. ఈ కార్డులన్నింటి ద్వారా ప్రతినెలా 18,20,789 కిలోలు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారు.

ముమ్మరంగా ఈ-కేవైసీ



సర్కిల్-7 పరిధిలో ఈ-కేవైసీ ప్రక్రియ ముమ్మరం కొనసాగుతోంది. ఆధార్ కార్డు సంఖ్య అనుసంధానంగా ఉన్న మొబైల్ ఫోన్ ద్వారా ఈ-పోస్ యంత్రాల్లో వేలిముద్ర వేయాల్సి ఉంటుంది. ప్రతి రేషన్ షాపులో ఈ-కేవైసీ చేసుకోవడానికి సౌకర్యాలు కల్పించాం.

– సయ్యద్ అమ్జద్ అలీ, సూపరింటెండెంట్, సర్కిల్-7

ఈ-కేవైసీ తప్పనిసరి



కార్డుదారులందరూ తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలి. ఇందుకోసం ఫిబ్రవరి ఆఖరు వరకు గడువు పెంచాం. సర్కిల్-7 పరిధిలో ఇప్పటి వరకు 75.99 శాతం ఈ-కేవైసీ పూర్తయ్యింది. ప్రతిరోజూ దీనిపై పర్యవేక్షణ ఉంటుంది. ఈ ప్రక్రియ మొత్తం 5 నిమిషాల్లో పూర్తవుతుంది. ఆదివారం కూడా రేషన్ దుకాణాల్లో వేలిముద్ర వేయవచ్చు.

– సరస్వతి, ఏసీఎస్‌ఓ, సర్కిల్-7

నైపుణ్యాభివృద్ధికి జాతీయ విద్యావిధానం తోడ్పాటు

ఉస్మానియాయూనివర్సిటీ: విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి జాతీయ విద్యావిధానం ఎంతో తోడ్పాడుతుందని, దీన్ని విజయవంతంగా అమలు చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల షాద్‌నగర్ ఆధ్వర్యంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సహకారంతో 'జాతీయ విద్యా విధానం-2020' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలోని ఐపీఈ హాల్‌లో ప్రారంభమైంది.

అత్యాధునిక ల్యాబ్‌ల ఏర్పాటే 'మనూ' లక్ష్యం

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ల్యాబ్‌లను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా పని చేస్తున్నామని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఏఆర్/వీఆర్ (ఆగ్మెంటెడ్ రియాలిటీ/ వర్చువల్ రియాలిటీ) మెటావర్స్ ప్రాజెక్టు ల్యాబ్‌ను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అధునాతన పరిశోధన, ఆవిష్కరణల కోసం ఈ ల్యాబ్‌ను అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ ద్వారా సీఎస్‌ఐటీకి రూ.95 కోట్ల నిధులను కేటాయించడం ద్వారా ఈ ల్యాబ్ ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. వికలాంగులకు మద్దతివ్వడం, మేధోపరమైన వైకల్యం ఉన్న వారిలో స్వాతంత్ర్యాన్ని పెంపొందించడం, సాధికారత కల్పించడం, పెంపొందించడం లక్ష్యంగా ప్రభుత్వం నిబద్ధతతో సరితూగే విశ్వవిద్యాలయం యొక్క ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో ఒకటిగా నిలిచిందన్నారు. అకడమిక్ ఎక్సలెన్స్, ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్ కోసం ఒక సహకార వాతావరణాన్ని సృష్టించడంలో విశ్వవిద్యాలయానికి ప్రతీకగా ఈ ల్యాబ్ మారుతుందన్నారు. మన ప్రపంచాన్ని తీర్చిదిద్దే వినూత్న పరిశోధనలు, ఆవిష్కరణలతో నిండిన భవిష్యత్తుకు పోర్టల్‌గా ల్యాబ్‌ను ఉంచడంతో పాటు యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం కొత్త సరిహద్దులను అన్వేషించడానికి సిద్ధంగా ఉందన్నారు.